సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం। 3। ఆగస్టు। 2025

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విచారణ వేగవంతం చేయాలి

జిల్లా జడ్జి పాటిల్ వసంత్



మాట్లాడుతున్న జడ్జి పాటిల్ వసంత్, పక్కన ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

కొత్తగూడెంటౌన్: జైలులో ఉన్న ముద్దాయిల కేసులను త్వరగా విచారణ చేపట్టి అంతిమ తీర్పునకు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. కొత్తగూడెం జిల్లా కోర్టులో పోలీసు అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారెంట్ పెండింగ్ కేసుల్లో సాక్షులను తీసుకురావాలని, కొత్తగా నమోదైన కేసుల్లో వెంటనే చార్జ్‌షీట్‌ను దాఖలు చేయాలని సూచించారు. పెండింగ్ కేసులు లేకుండా ఎప్పటికప్పుడు న్యాయవాదులు, పోలీసులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, పీపీలు, ఏపీపీలు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన



రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఇల్లెందురూరల్: మండలంలోని రాఘబోయిన గూడెం, పూబెల్లి, రేపల్లెవాడ గ్రామాల్లో కేంద్ర బృందం ప్రతినిధులు శనివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. డంప్‌షెడ్లు, ఇంకుడు గుంతలు, పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. పలు వీధుల్లో పర్యటించి ఇంటింటి చెత్త సేకరణ ఎలా జరుగుతోందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లలో మరుగుదొడ్లు, వాటి నిర్వహణపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ అధికారులు, సిబ్బందితో సమావేశమై కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రతినిధులు కె.జయంత్, ఎస్.రవిచంద్ర, ఎస్‌బీఎం జిల్లా కో – ఆర్డినేటర్ రేవతి, ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న స్పందన

టేకులపల్లి : సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన అన్నారు. మండలంలోని సులానగర్ పీహెచ్‌సీని శనివారం ఆమె తనిఖీ చేశారు. ల్యాబ్‌లో చేస్తున్న రక్త పరీక్షలను పరిశీలించి వివరాలు ఆరా తీశారు. ల్యాబ్ టెక్నీషియన్ రాజుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జ్వరం లక్షణాలు ఉన్న వారికి డెంగీ, మలేరియా నిర్ధారణకు త్వరగా ఫలితం వెల్లడయ్యే ఆర్డీటీ పరీక్షలు నిర్వహించాలని, ఎలీసా పరీక్ష కోసం రక్త నమూనాలను తెలంగాణ హబ్ కేంద్రానికి పంపించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల విషయంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు దృష్టి పెట్టాలని, దోమకాటుతో వచ్చే వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా అవసరమైన రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి శుక్ర, మంగళవారాల్లో విధిగా డ్రైడే నిర్వహించాలని, జ్వర పీడితుల గుర్తింపునకు ప్రతీ నెల 7 నుంచి 17 వరకు ఇంటింటి సర్వే నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కంచర్ల వెంకటేష్, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, స్టాఫ్ నర్స్ జగదాంబ, సూపర్‌వైజర్ నాగబండి వెంకటేశ్వర్లు, కౌసల్యసింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహం.. అనంతం

స్నేహం.. అత్యంత స్వచ్ఛమైన బంధం. రక్తం పంచుకుని పుట్టకపోయినా అంతకు మించిన అనుబంధం స్నేహితుల మధ్యే ఉంటుంది. నేడు(ఆదివారం) స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఖమ్మం, పాల్వంచలో 'సాక్షి' ఆధ్వర్యాన నిర్వహించిన సర్వేలో ఈ మాటలు అక్షర సత్యమని రుజువైంది. కష్టాల్లో తోడుగా ఉండే వారే నిజమైన స్నేహితులు కాగా.. అవసరాల కోసం వచ్చివెళ్లే వారు కాదని ఎక్కువ మంది ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. రెండు చోట్లా కలిపి 100 మంది (50 మంది పురుషులు, 50 మంది మహిళలు)ని సర్వే చేయగా .. హృదయాలను తాకేలా అభిప్రాయాలు వెల్లడించారు.

– ఖమ్మంమయూరిసెంటర్/పాల్వంచ



- స్నేహితుల విలువ శాశ్వతం
- అన్నీ పంచుకునే విలువైన వ్యక్తులు మిత్రులే..

నేడు స్నేహితుల దినోత్సవం



● కల్మషం లేనిదే స్నేహం

స్నేహం అంటే ఏమిటి? అన్న ప్రశ్నకు 73 మంది కల్మషం లేనిది.. అని బదులిచ్చారు. అవసరాలు తీర్చేదే స్నేహం అని కేవలం 27 మంది మాత్రమే చెప్పారు. నిజమైన స్నేహానికి ఆర్థికపరమైన లావాదేవీలు, స్వార్థపూరితమైన ఆలోచనలు అడ్డు రావని ఇది స్పష్టం చేస్తోంది.

● కలుషితం కాలేదు..


ఫ్రెండ్‌షిప్ ఇప్పుడు కలుషితమైందా? అన్న ప్రశ్నకు 82 మంది 'లేదు' అని గట్టిగా బదులిచ్చారు. స్నేహం పవిత్రత ఏ మాత్రం చెక్కుచెదరలేదని.. కలుషితం కాలేదని వారి మాటలు తేల్చిచెప్పాయి. ఇదే సమయంలో 18 మంది మాత్రం కొందరి వల్ల స్నేహం కలుషితమవుతోందనే భావన వ్యక్తం చేశారు.

● నా నిజమైన స్నేహితులు

నీకు ఎందరు నిజమైన స్నేహితులు ఉన్నారు? అన్న ప్రశ్నకు 70 మంది ఇద్దరికి మించి ఉన్నారని బదులిచ్చారు. ఎక్కువ మంది స్నేహితులు ఉండడమే అంత ఆనందానికి కారణమని తెలిపారు. ఇక మరో 30మంది నిజమైన స్నేహితులు ఒక్కరే ఉన్నారని వెల్లడించారు.

● అమ్మా నాన్న తర్వాతే..

స్నేహితులకు ఇచ్చే స్థానంపై ఆరా తీయగా.. 34 మంది అమ్మ, నాన్న తర్వాత స్నేహితుల స్థానంగా చెప్పారు. మరో 53 మంది నాన్న, అమ్మ తర్వాత ఫ్రెండ్‌కు స్థానం కల్పించారు. ఇంకొక 13 మంది స్నేహితుల తర్వాతే అమ్మనాన్నకు స్థానం ఇచ్చారు. ఈ సమాధానాల ఆధారంగా కుటుంబ సభ్యుల తర్వాతే స్నేహితులకు ప్రాధాన్యత ఇచ్చినట్లయింది. తద్వారా ప్రస్తుత తరం వారు తల్లిదండ్రులతోనూ స్నేహితుల మాదిరే ఉంటున్నారని తేటతెల్లమైంది.



స్నేహితులతోనే అన్నీ పంచుకుంటాం..



తల్లిదండ్రుల తర్వాత కష్టసుఖాలు, ఆనందాలు పంచుకునేది స్నేహితులతోనే. తల్లిదండ్రులతో పాటు స్నేహితులు కూడా కుటుంబీకులే. అన్ని దినుసులు వేస్తేనే మంచి వంటకం తయారైనట్లు మంచి స్నేహితులు ఉంటే మన జీవితం కూడా రుచికరమైన వంటలా ఉంటుంది.

– వి.హనీష, వార్డు ఆఫీసర్, కేఎంసీ

స్థానిక పోరుకు సన్నద్ధం !

- రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఉత్కంఠ
- గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయం
- జిల్లాలో 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు



బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయం

బూర్గంపాడు: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను ఖరారు చేయగా అవసరమైన సామగ్రిని మండల కేంద్రాలకు చేరవేస్తున్నారు. తొలుత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా.. ప్రభుత్వ సూచనల మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిపేందుకే కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నారు. అయితే పరిషత్ స్థానాల రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఉత్కంఠ మొదలైంది. రాజకీయ పార్టీ గుర్తులపై జరిగే ఈ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది.

22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలు..

జిల్లాలో 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలుగా అధికారులు ఖరారు చేశారు. గత ఎన్నికల్లో బూర్గంపాడు, భద్రాచలం మండలాల్లో ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించలేదు. భద్రాచలం, సారపాకను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసే యోచనతో గత ప్రభుత్వం ఈ రెండు గ్రామ పంచాయతీల్లో ఎంపీటీసీ స్థానాలను రద్దు చేసింది. అయితే కొన్ని న్యాయపరమైన చిక్కులతో ఈ రెండు జీపీలను యథావిధిగా కొనసాగించాల్సి వచ్చింది. దీంతో ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో బూర్గంపాడు మండలం సారపాక, భద్రాచలం మండలంలో కూడా ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేయగా.. అశ్వారావుపేటను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో అక్కడ ఎంపీటీసీ స్థానాలు తగ్గనున్నాయి. అలాగే సుజాతనగర్‌ను కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం చేస్తుండగా అక్కడా ఎంపీటీసీ స్థానాలు తగ్గనున్నాయి. దీంతో గతంలో 236 ఎంపీటీసీ స్థానాలుండగా ఈసారి ఆ సంఖ్య 233కు తగ్గింది.

రిజర్వేషన్లు మారేనా..?

జిల్లాలో కొన్ని మండలాల్లో ఎంపీటీసీ స్థానాలు తగ్గడం, కొన్ని చోట్ల పెరగడంతో రిజర్వేషన్లు కూడా మారే అవకాశాలున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లు పదేళ్ల పాటు(రెండు విడతలు) మారకుండా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎంపీటీసీ స్థానాల్లో హెచ్చుతగ్గుల కారణంగా రిజర్వేషన్లు మారుతాయనే చర్చ సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను పెంచుతూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లోనే అమలు చేయాలని భావిస్తోంది. ఈ క్రమంలో ఏ స్థానం ఎవరికి రిజర్వ్ అవుతుందనే ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. ముఖ్యంగా జనరల్ స్థానాల కోసం కొందరు ఆశగా ఎదురుచూస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికలలో జనరల్ స్థానాల్లో గెలుపొందిన, ఓడిపోయిన అభ్యర్థులు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు గత రిజర్వేషన్లే యథావిధిగా కొనసాగేలా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో పోటీకి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఇప్పటికే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యేలు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి కేడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామ స్థాయిలో ప్రచారం సాగిస్తుండగా ప్రతిపక్ష బీఆర్‌ఎస్.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తోంది. ప్రాదేశిక ఎన్నికల్లో గెలిచి జిల్లాలో తమ ప్రాబల్యం తగ్గలేదని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ గట్టి ప్రయత్నాలు చేస్తోంది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో నాలుగు చోట్ల కాంగ్రెస్, కొత్తగూడెంలో మిత్రపక్షమైన సీపీఐ ఎమ్మెల్యే ఉండడంతో స్థానిక ఎన్నికల్లోనూ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బీఆర్‌ఎస్ కూడా జిల్లాలో మెజారిటీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు గెలిచి సత్తా చాటాలని భావిస్తోంది. ఈ రెండు పార్టీల్లోనూ పోటీకి ఆశావహులు ఎక్కువ మంది ఉన్నారు. దీంతో సొంత పార్టీలోనే వర్గ విభేదాలు బహిర్గతమయ్యే అవకాశాలున్నాయి. మరోవైపు బీజేపీ, వామపక్షాలు కూడా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి.

జిల్లాకు సంపూర్ణత అభియాన్ అవార్డు

గవర్నర్ చేతుల మీదుగా అందుకున్న కలెక్టర్



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చుంచుపల్లి: వెనుకబడిన జిల్లాల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ తీసుకొచ్చిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో అభివృద్ధి సూచికలన్నింటినీ సమర్థంగా సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లో శనివారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు సంపూర్ణత అభియాన్ అవార్డు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు రాష్ట్రస్థాయిలో అవార్డు రావడం మండల, గ్రామస్థాయి సిబ్బంది, ప్రజల చొరవకు గుర్తింపుగా నిలిచిందన్నారు. ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో అన్ని శాఖలు సమన్వయంతో పని చేశాయని అన్నారు. భవిష్యత్‌లో జిల్లా మరిన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిచేలా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

ప్రామాణిక గ్రంథంగా 'ఇలవేల్పుల చరిత్ర'

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భవిష్యత్ తరాలకు తెలిసేలా రూపొందిస్తున్న ఇలవేల్పుల గ్రంథం ప్రామాణికంగా మారుతుందని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల చరిత్ర, కట్టుబాట్లు, పూజా విధానాలు ప్రస్తుత, భవిష్యత్ తరాలకు తెలవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఐదు గోత్రాలు, ఇలవేల్పులకు సంబంధించిన తలపతులను, ఆర్తి బిడ్డలను బృందాలుగా చేసినట్లు తెలిపారు. వీరి ద్వారా మారుమూల ఆదివాసీ గ్రామాల్లో ఇలవేల్పుల చరిత్ర సేకరిస్తామని, ఒక్కో ఆదివాసీ తెగలకు సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించడం పూర్తయిందని తెలిపారు. ఆ తర్వాత అభిప్రాయ సేకరణ ఉంటుందని, ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఇలవేల్పుల గ్రంథం రూపకల్పన, విడుదల ఉంటాయని వివరించారు. ఈ చరిత్ర వెయ్యి సంవత్సరాలైనా చెక్కు చెదరకుండా ఉండేలా ప్రయత్నిస్తున్నామని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఏసీఎంఓ రమేష్, రిటైర్డ్ ఏసీఎంఓ రమణయ్య, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి, తలపతులు, ఆర్తి బిడ్డల సంఘం నాయకులు జగపతిరావు, కోటేశ్వరరావు, చలపతిరావు, పోషాలు, భద్రాద్రి, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల తలపతులు, ఆర్తి బిడ్డలు పాల్గొన్నారు.

రామాలయ ఈఓ బదిలీ

- ఆర్‌అండ్‌బీ శాఖకు కేటాయింపు
- భద్రాచలం ఆర్‌డీఓ దేవాదాయ శాఖకు..
- దామోదర్‌రావుకే ఆలయ ఈఓ బాధ్యతలు ?



ఈఓ రమాదేవి



ఆర్‌డీఓ దామోదర్‌రావు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఈఓ ఎల్.రమాదేవి బదిలీ అయ్యారు. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఆమె ఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా ఇటీవలే ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ క్రమంలో రవాణా, రోడ్లు, భవనాల శాఖకు డిప్యూటేషన్ ప్రాతిపదికన బదిలీ చేస్తూ శనివారం జీఓ జారీ చేసింది. అలాగే ఇప్పటివరకు భద్రాచలం ఆర్‌డీఓగా విధులు నిర్వహించిన దామోదర్‌రావు దేవాదాయ శాఖకు బదిలీ అయ్యారు.

ఆలయంలో ప్రక్షాళన చర్యలు..

ఆలయ ఈఓగా రమాదేవి 2023 ఫిబ్రవరి 16న ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలల్లోనే పలు ప్రక్షాళన చర్యలు చేపట్టారు. ఆ తర్వాత కొద్ది నెలలకే పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించి మూడు పర్యాయాలు శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలను విజయవంతం చేశారు. పారదర్శకత కోసం అన్ని విభాగాల్లోనూ ఆన్‌లైన్ సేవలు ప్రవేశపెట్టారు. స్మార్ట్ ఫోన్లలో 'భద్రాచలం టెంపుల్ ఇన్‌ఫర్మేషన్ (బీటీఐ)' యాప్‌ను రూపొందించి సేవలను అరచేతిలో ఉంచారు. తాజాగా అకౌంట్లను సైతం ఆన్‌లైన్ చేశారు. అవినీతిని అరికట్టి నెలకు రూ.కోటి ఆదాయం వచ్చేలా చూశారు. పురుషోత్తపట్నంలోని ఆలయ భూముల పరిరక్షణకు పలుమార్లు రంగంలోకి దిగారు.

ఆర్‌డీఓకు ఈఓ బాధ్యతలు ?

భద్రాచలం ఆర్‌డీఓగా ఉన్న దామోదర్‌రావుకు దేవాదాయ శాఖలో సేవలను కేటాయించారు. అయితే రామాలయ ఈఓగా ఆయనకు బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం సాగుతోంది. రెవెన్యూ శాఖలో ఉన్నప్పటికీ ఇటీవల మాఢ వీధుల విస్తరణలో కీలకమైన భూ సేకరణను విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు పెద్దలఆశీస్సులు ఉండడంతో ఆయనకే బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం.

సెంట్రల్ యూనివర్సిటీలో సీట్లు

పాల్వంచరూరల్ : పాల్వంచ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు సీయూ సెట్‌లో ప్రతిభ కనబర్చి సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ బోయిన ఝాన్సీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీ.కాం విద్యార్థిని టి.దివ్యకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో, ఎ.అలేఖ్య, కె.శ్రీవేణికి ఏపీలోని అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో సీట్లు వచ్చాయని వివరించారు. వారిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

నానో యూరియాతో మంచి ఫలితాలు

వైరా: రైతులు పంటల్లో సంప్రదాయ గుళికల యూరియాకు నానో యూరియా వాడడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరంలో నానో యూరియా, నానో డీఏపీపై శనివారం రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. రైతులు అవసరం మేరకే యూరియా వాడడం ద్వారా భూసారాన్ని సంరక్షించడమే కాక ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు.

ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ సమాధానం చెప్పాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని



మాట్లాడుతున్న తమ్మినేని, పక్కన నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఆపరేషన్ సిందూర్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలకు ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. కొత్తగూడెం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత్ – పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ట్రంప్ అంటున్నారని, రెండు దేశాల మధ్య అమెరికా జోక్యం తగదని మోదీ ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. దీనిపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు అడిగినా ప్రధాని నోరు మెదపడం లేదని ఆరోపించారు. మైనార్టీలపై కక్ష సాధించేందుకే బిహార్‌లో ఓటర్ల రివిజన్ ప్రక్రియను ముందుకు తీసుకొచ్చారని, ముస్లింల ఓట్లు తగ్గించేందుకు కుట్ర పన్నుతున్నారని అన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హులకు కాకుండా కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికే ఇవ్వడం సరైంది కాదన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ఏపీలో విలీనమైన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని అన్నారు. పోలవరం నిర్మిస్తే భద్రాచలం మునక తప్పదని, దీన్ని అడ్డుకోవాలని అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, బండారు రవికుమార్, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, అన్నవరపు కనకయ్య, యలమంచి రవికుమార్, ఎం.జ్యోతి, అన్నవరపు సత్యనారాయణ, పుల్లయ్య, బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు పాల్గొన్నారు.

స్నేహం.. సమాజ సేవ

కలిసి చదువుకునే, కలిసి పనిచేసే క్రమంలో ఎందరో పరిచయమవుతుంటారు. వారిలో కొందరు మాత్రం స్నేహితులుగా మారతారు. వారిలో ఒకరిద్దరు మాత్రమే ఆప్త మిత్రులుగా మిగిలిపోతారు. కష్టసుఖాల్లో పాలు పంచుకుంటారు. ఆపద, అవసరాల్లో ఉన్న మిత్రులకు తోడ్పడుతుంటారు. ఇతరులకూ సాయం అందిస్తూ సామాజిక సేవ చేస్తుంటారు. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా అలాంటి కొందరు మిత్రుల గురించి తెలుసుకుందాం.

- సేవా కార్యక్రమాలు చేపడుతున్న మిత్ర బృందాలు
- అవసరార్థులకు ఆర్థికసాయం, రక్తదానం, అన్నదానం
- పలువురికి మార్గదర్శనం చేస్తూ బంగారు భవిష్యత్‌కు కృషి

నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం



మిత్ర చతుష్టయం.. కాలేజీకి ఆర్థికసాయం


భద్రాచలం రామాలయంలో మిత్రబృందం

పాల్వంచరూరల్: హరి, కృష్ణమోహన్, శివనాగేశ్వరరావు, సోమసుందరం నలుగురు స్నేహితులు. వీరు పదో తరగతి వరకు 1981–1982 పాల్వంచలోని బొల్లోరిగూడెం హైస్కూల్లో, ఇంటర్ 1982–1984 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్నారు. వీరిలో హరి, కృష్ణమోహన్ ప్రస్తుతం వారు చదివిన హైస్కూల్లోనే ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. శివనాగేశ్వరరావు, యూఎస్‌ఏలో, సోమసుందరం నైజీరియాలో ఉద్యోగాలు చేస్తున్నారు. చదువుకునే రోజుల్లో వీరి మధ్య ఏర్పడ స్నేహం ఇప్పటికీ కొనసాగుతోంది. ఇతర దేశాల్లో ఉన్న ఇద్దరు మిత్రులతో నిత్యం సామాజిక మాధ్యమాల ద్వారా క్షేమ సమాచారాలు పంచుకుంటున్నారు. కుటుంబాలతో సహా స్నేహంగా ఉంటున్నారు. తాము చదువుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించగా, నలుగురూ కలిసి కాలేజీ అభివృద్ధికి రూ. 50 వేలు విరాళంగా ఇచ్చారు.

సేవా మార్గంలో..


చిన్నారి చికిత్సకు రూ.53 వేలు అందజేస్తున్న ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు (ఫైల్)

కొత్తగూడెంటౌన్: ఓ మిత్రుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మరో స్నేహితుడు కరోనాతో మరణించాడు. ఒకరికి రక్తం అందక, మరొకరికి సరైన చికిత్స అందక చనిపోయారు. ఆ ఘటనతో చలించిన స్నేహితులు 2019లో ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. డిప్లొమో పూర్తిచేశాక ఎవరి వృత్తిలో వారు కొనసాగుతూ సమాజసేవ చేస్తున్నారు. తొలుత సీహెచ్ శ్రీకాంత్, శివ, చింటూ, సిద్ధు, ఉదయ్, సత్యసాయి, కౌశిక్, శ్రీను, నవాజ్ తదితరులు ఫౌండేషన్ ఏర్పాటు చేయగా, ప్రస్తుతం 50 మంది వరకు కలిసి పనిచేస్తున్నారు. కొత్తగూడెం రైటర్‌బస్తీకి చెందిన వీరు రక్తదానం, అన్నదానం చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు ఐదు వేల మందికి రక్తదానం చేశారు. వారంలో మూడు రోజులు రైల్వే స్టేషన్, బస్టాండ్ సెంటర్‌లు, రోడ్లపై అనాథలు, వృద్ధులకు అన్నదానం చేస్తున్నారు. ఆరు నెలలకోసారి రక్తదాన శిబిరం నిర్వహిస్తూ తలసేమియా బాధితులకు రక్తం అందిస్తున్నారు. ఆరేళ్లుగా దాదాపు 800 మందికి రక్తదానం చేశారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, అనారోగ్యానికి గురైనవారికి ఆర్థికసాయం చేస్తున్నారు. నిత్యం సేవా కార్యక్రమాలతో ఈ మిత్రబృందం పలువురి అభినందనలు అందుకుంటోంది.

ఆపదలో అండగా నిలుస్తూ..


చంద్రశేఖర్ కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు(ఫైల్)

భద్రాచలంఅర్బన్: భద్రాచలం కొర్రాజులగుట్ట ప్రభుత్వ హైస్కూల్‌లో 1998–99లో పదో తరగతి చదివిన విద్యార్థులు 2019లో రీయూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. తమ కుటుంబాల్లో ఎవరికి ఆపద వచ్చినా ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. వీరి స్నేహితుడు, కాంట్రాక్టర్ చంద్రశేఖర్ మృతి చెందగా అతని కుటుంబానికి రూ.55 వేలు ఆర్థిక సాయం చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడు దాసరి నాగేశ్వరరావు కుటుంబానికి రూ.లక్ష, అనారోగ్యానికి గురైన స్నేహితురాలు మంగకు రూ. 50 వేలు ఆర్థికసాయం చేశారు. ఇలా మిత్రులను కుటుంబాలను ఆదుకుంటూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

నిత్యం టచ్‌లో ఉంటాం..


సతీష్, వీరేంద్ర

భద్రాచలంఅర్బన్: ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన సతీష్ కుమార్, వీరేంద్ర చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఇద్దరూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించాలని ప్రయత్నించారు. సతీష్ 2019లో ఎస్‌ఐగా ఎంపిక కాగా, వీరేంద్ర మాత్రం బ్యాంకింగ్ వృత్తిలో చేరాడు. సతీష్ భద్రాచలంలో ఎస్‌ఐగా పనిచేస్తుండగా, వీరేంద్ర హైదరాబాద్‌లో ఎస్‌బీఐలో బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. వృత్తిరీత్యా వేర్వేరు శాఖలు అయినా నిత్యం ఫోన్‌లో మాట్లాడుకుంటామని సతీష్ తెలిపాడు.

‘నేస్తం’.. సమాజహితం


వైద్య సేవలకు ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

బూర్గంపాడు: మండలంలోని మోరంపల్లి బంజరలో 10 మంది స్నేహితులు కలిసి సమాజ హితం కోసం 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన నేస్తం చారిటబుల్ ట్రస్ట్ ఎంతోమందికి సాయమందిస్తోంది. చిరుద్యోగులు, రైతులు, చిరువ్యాపారులతో ఏర్పాటైన ఈ ట్రస్ట్ జిల్లాలోనే అగ్రగామిగా కొనసాగుతుండడం విశేషం. పేదలకు విద్య, వైద్యం, నిరాశ్రయుల ఇళ్ల నిర్మాణాలకు ఆర్థికంగా సాయపడుతున్నారు. రక్తదాన శిబిరాల ద్వారా రోగుల వైద్య సేవలకు సహకరిస్తున్నారు. కరోనా సమయంలో ఎంతో మందికి అండగా నిలిచారు. సభ్యులంతా ప్రతీ నెల వారి ఆదాయంలో కొంత మొత్తాన్ని ట్రస్ట్‌కు కేటాయిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్ని పనులున్నా సేవా కార్యక్రమాల కోసం మిత్రులమంతా నెలకు కనీసం మూడు, నాలుగుసార్లు కలుసుకుంటామని ట్రస్ట్ అధ్యక్షుడు బత్తుల రామకొండారెడ్డి తెలిపారు. భవిష్యత్‌లో సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు.

స్నేహితుల ‘హెల్ప్‌లైన్’


హర్షవర్ధన్ కటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న హెల్ప్‌లైన్ సభ్యులు (ఫైల్)

ఇల్లెందు: స్నేహితులైన ఆదివాసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు 35 మంది కలిసి 2013 మార్చి 9న ఇల్లెందు కేంద్రంగా హెల్ప్‌లైన్ సంస్థను ప్రారంభించారు. వీరిలో కుర్సం అంజయ్య, కబ్బాకుల రవి, కుంజ కృష్ణ, కొడెం కృష్ణ, కల్తీ రాంబాబు, కొర్సా ఆదినారాయణ, గలిగే రాంబాబు, బొర్రా రాంబాబు తదితరులు ఉన్నారు. ఇల్లెందు, పరిసర ప్రాంతాల ఆదివాసీ ప్రజలకు ఉచితంగా ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నారు. ఇందుకోసం ఓ ఇంటిని అద్దెకు తీసుకుని, ఫర్నిచర్, పరికరాలను సమకూర్చుకున్నారు. ఆపరేటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఆదివాసీ విద్యార్థులకు, నిరుద్యోగులకు కెరీర్‌గైడెన్స్, స్పోకెన్ ఇంగ్లిష్ కోచింగ్ ఇప్పిస్తున్నారు. ఇక కరోనా సమయంలో ఆదివాసీ గూడేల్లో నిత్యాసరాలు పంపిణీ చేశారు. 2020 నుంచి అవసరార్థులకు ఆర్థికసాయం కూడా చేస్తున్నారు. ప్రమాదంలో గాయపడ్డ కొర్సా కిరణ్‌కు రూ. 20 వేలు, బండ హర్షవర్ధన్‌కు రూ. 40 వేలు, అనారోగ్యానికి గురైన రోహన్‌కు రూ.40 వేలు, ధనసరి తపస్వినికి ఆర్థిక సాయం అందించారు. గుండాల మండలం చీమలగూడెం గ్రామానికి చెందిన కల్తీ భవాని ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా చదువు కోసం రూ. 25 వేలు విరాళం అందించారు. ములుగు జిల్లా మంగపేట మండలం శనిగకుంట గ్రామంలో 40 ఇళ్లు అగ్నికి ఆహుతైతే రూ. 2 లక్షలతో బియ్యం, బట్టలు అందించారు. ఇలా 35 మంది స్నేహితులు సామాజిక సేవ చేస్తూ పలువురు ఆదర్శంగా నిలుస్తున్నారు.

అండగా ఉంటున్నాం..



ఆదివాసీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్ సేవలు ఉచితంగా అందిస్తున్నాం. మరోవైపు ఇబ్బందుల్లో ఉన్నవారికి ఆర్థికంగా సాయం చేస్తున్నాం. మేము కొందరికి అండగా ఉంటున్నామనే సంతోషం మిగులుతుంది.

–కుర్సం అంజయ్య, హెల్ప్‌లైన్ వ్యవస్థాపక సభ్యుడు

స్నేహాన్ని మరిచిపోలేం


స్నేహితురాలు నీరజతో సులోచనారాణి

పాల్వంచరూరల్: పాల్వంచకు చెందిన సులోచనారాణి 1998లో బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న రోజుల్లో అదే కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్ జివ్వాజి నీరజతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి స్నేహితులుగా మారారు. నీరజ ప్రస్తుతం హైదరాబాద్‌లోని నోయపాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తోంది. ఎంత ఒత్తిడి ఉన్నా సమయం దొరికినప్పుడల్లా ఫోన్‌లో మాట్లాడుకుంటామని, సామాజిక మాధ్యమాల ద్వారా క్షేమ సమాచారాలను తెలుసుకుంటామని, స్నేహాన్ని మరిచిపోలేమని మాజీ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సులోచనారాణి తెలిపారు.

క్లుప్తంగా

యూరియా పంపిణీలో ఆలస్యం..!


పీఏసీఎస్ వద్ద రైతులు

కరకగూడెం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేల్ పాయింట్‌లో శనివారం పీఓఎస్ మిషన్ పనిచేయలేదు. దీంతో యూరియా పంపిణీలో ఆలస్యం కాగా, రైతులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో సిబ్బందికి, రైతులకు మధ్య వాగ్వాదం నెలకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మిషన్‌లో చిన్న సమస్య తలెత్తడంతో కొత్తగూడెం తీసుకెళ్లి మరమ్మతులు చేయించామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ ఛటర్జీ తెలిపారు.

మాంసం దుకాణదారులకు జరిమానా


దుకాణాదారుడికి జరిమానా విధించి రశీదు అందిస్తున్న కమిషనర్ నాగరాజు

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని భద్రాచలం మార్గంలో ఉన్న చికెన్, మటన్, చేపల దుకాణాలను శనివారం కమిషనర్ బి.నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాంసం దుకాణాల వద్ద పరిశుభ్రత లేకపోవడం, దుమ్ము, ధూళి పడకుండా రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో జరిమానా విధించారు. ఒక్కో దుకాణానికి రూ.వెయ్యి చొప్పున మొత్తం ఆరు దుకాణాలకు రూ.6వేల జరిమానా విధించి రశీదులు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యాపారులు మున్సిపల్ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

మణుగూరుటౌన్: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ శివారులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కట్టుమల్లారానికి చెందిన కంగాల శ్రీను(48) శుక్రవారం రాత్రి కాసినకుంట చెరువులో చేపల వేటకు వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున చెరువులో వలకు చిక్కుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,052

ఆశ్రమ విద్యార్థుల ఆందోళన

పాఠశాలలో విచారణ చేపట్టిన ఎమ్మెల్యే, ఐటీడీఏ డీడీ


ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు


విచారణ చేపడుతున్న ఎమ్మెల్యే జారే, ఐటీడీఏ డీడీ మణెమ్మ

దమ్మపేట: ఉదయం సరైన సమయానికి అల్పాహారం అందడం లేదని మండల పరిధిలోని చీపురుగూడెంలో ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం విద్యార్థులు మాట్లాడుతూ హాస్టల్‌లో వసతులు, పారిశుద్ధ్య నిర్వహణ సరిగాలేదని వాపోయారు. మెనూ సక్రమంగా అమలు చేయడంలేదని, ఆహార పదార్థాల్లో నాణ్యత ఉండటం లేదని పేర్కొన్నారు. ఫ్యాన్లు లేవని, తాగునీటి సౌకర్యం సక్రమంగా లేదని తెలిపారు. దీంతో తరచూ అనారోగ్యం బారిన పడుతున్నామని చెప్పారు. దీంతో సాయంత్రం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటీడీఏ డీడీ మణెమ్మ, ఏటీడీఓ చంద్రమోహన్‌లు పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొద్ది రోజులుగా ఆహార పదార్థాల్లో నాణ్యత ఉండటం లేదని, వసతుల కల్పన సరిగా లేదని విద్యార్థులు వారి ఎదుట ఆవేదన చెందారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని తేలడంతో ప్రాథమిక విచారణ ఆధారంగా ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సునీతను తాత్కాలికంగా భద్రాచలం ఐటీడీఏ కార్యాలయానికి సరెండర్ చేస్తున్నామని డీడీ తెలిపారు. విద్యార్థుల నుంచి పూర్తిస్థాయిలో సేకరించి పీఓకు నివేదిక అందజేస్తామని తెలిపారు. తుది నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


శ్రీనివాస్(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శనివారం మృతి చెందాడు. ఎస్సై టీ యయాతీ రాజు కథనం ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం గాంధీనగర్ ఏలూరివారి వీధికి చెందిన ఆదుర్తి శ్రీనివాస్(44) బైక్‌పై గత నెల 29వ తేదీన వేలేరుపాడు మండలం భూదేవిపేట గ్రామానికి వచ్చి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలోని అశ్వారావుపేట మండలం కొత్తూరు గ్రామ సమీపంలో అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్రగాయాలు కాగా కుటుంబీకులు రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రసన్నరాణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతు ఆత్మహత్యాయత్నం

ఇల్లెందురూరల్: అటవీశాఖ అధికారులు తన సాగు భూమిని లాక్కున్నారనే ఆవేదనతో మండలంలోని పూబెల్లి గ్రామానికి చెందిన రైతు మోకా రమేష్ శనివారం ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల కథన ప్రకారం.. పూబెల్లి గ్రామ శివారులో తొమ్మిదిన్నర ఎకరాల విస్తీర్ణంలో రమేష్ కుటుంబ సభ్యులు సాగు చేసుకుంటున్నారు. ఇందులో ఎకరన్నర ఇటీవలే పోడు నరికినట్లు గుర్తించి అటవీశాఖ అధికారులు సదరు భూమిని స్వాధీనం చేసుకున్నారు. ట్రెంచ్ కొడుతుండగా రమేష్ అక్కడకు చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో రైతుకు, అటవీ అధికారులకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ఖమ్మం సిఫారసు చేశారు. కాగా ఘర్షణతో బీట్ అధికారి రాణికి బీపీ తగ్గడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రైతు రమేష్ 1.5 ఎకరాల విస్తీర్ణంలో పోడు నరికినట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నామని ఇల్లెందు రేంజ్ అధికారి చలప తిరావు తెలిపారు.

వెదురు గడలు స్వాధీనం

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న వెదురు గడలను శనివారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధి పాపకొల్లు–బీ బీట్ నుంచి వెదురు గడలు తరలిస్తుండగా ఎఫ్‌ఎస్‌ఓ మల్లయ్య, ఎఫ్‌బీఓలు విజయలక్ష్మి, శ్రావణ్ కుమార్, ఎస్కే రహీం, బి.నరసింహారావు వెళ్లి తనిఖీలు చేపట్టారు. భేతాళపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అటవీ ప్రాంతంలో వెదురు గడలను నరికి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా రాంపురంతండా గ్రామ సమీపంలో పట్టుకున్నారు. గడల విలువ రూ.28,690, వాహనాన్ని సీజ్ చేశామని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.